# చెత్త కుప్పల మధ్య విద్యుత్ బిల్లుల వసూళ్లు!



దుర్గంధం మధ్యే వినియోగదారుల చెల్లింపులు!

వసూళ్లపై ఉన్న శ్రద్ధ శుభ్రతపై లేకుంటే ఎలా?

విద్యుత్ శాఖకు స్వచ్ఛభారత్ మినహాయింపా?

2

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice

వార్త పత్రిక

గురువారం

25-06-2026

సంపుటి: (volume):2

సంచిక: (ISSUE):168

MEDAK,SANGAREDDY SIDDIPET

పేజీలు-4

# హాట్ టాపిక్‌గా.. మారీచి ఇంటి నంబర్ల వ్యవహారం!




3




## సిరి కథనంపై బిల్డర్స్ వర్గాల్లో చర్చ

- వివరణకు అందుబాటులో లేని డీసీ జ్యోతి రెడ్డి
- మారీచి వ్యవహారంపై స్పందించిన ఏసీపీ ప్రసీద
- సైట్ విజిట్ చేస్తాం..
- మాజీ డీసీ అజయ్ కుమార్ రెడ్డి లేఖను పరిశీలిస్తామన్న ఏసీపీ
- గత నోటీసులు, కూల్చివేత చర్యలపై దృష్టి
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే తదుపరి చర్యలు

(నిఘావిభాగం సిరిన్యూస్):

“మెరిసేదంతా బంగారం కాదన్నట్లు.. మారీచి విల్లాల ఇంటి నంబర్ల వ్యవహారం ప్రస్తుతం బిల్డర్స్ వర్గాల్లోనూ, స్థానికంగానూ హాట్ టాపిక్‌గా మారింది. ఇంటి నంబర్లు నిజంగా కేటాయించారా..? ఒకవేళ కేటాయించి ఉంటే ఏ ప్రాతిపదికన మంజూరు చేశారు..? గతంలో జారీ చేసిన నోటీసులు, కూల్చివేత చర్యల నేపథ్యంలో ఈ వ్యవహారంపై సిరి అడిగిన ప్రశ్నలకు ఏసీపీ ప్రసీద్ స్పందించడంతో ఇప్పుడు అందరి దృష్టి ఈ అంశంపైనే నిలిచింది.”

# కాకతీయుల మెతుకు సీమ..!

## నిజాం కాలపు సుభా కేంద్రం

- గణపతి దేవుడి నామకరణంతో ‘మెతుకు సీమ’గా మారిన రచవీడు
- కరువు కాలంలో కాకతీయ, దేవగిరి రాజ్యాలను ఆదుకున్న మంజీరా
- అల్లావుద్దీన్ ఖిల్జీ దాడులను తట్టుకుని నిలబడిన చారిత్రక మెదక్ కోట
- సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తులో పటిష్టమైన కోట.. 5 ఫిరంగి సెంటర్లు
- ప్రతాపరుద్రుడు నిర్మించిన గిడ్డంగులు నేటికీ సజీవ సాక్ష్యాలు
- వేద పండితులకు ఆశ్రయమిచ్చి ‘వేదక్‌పూర్’గా ఖ్యాతి
- హైదరాబాద్ సంస్థానంలో వరంగల్, గుల్బర్గా, ఔరంగాబాద్‌లతో పాటు సుభా కేంద్రంగా మెదక్
- 1936లో సంగారెడ్డికి మారిన అధికార యంత్రాంగం
- జిల్లా కేంద్రం సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన స్వామీజీ శ్రీ రామ్ దాస్

4



వీరనారి శంకరమ్మ ఏలిన మెదక్ ఘన చరిత్ర

## వేణుమాధవ్ చేరికతో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం

2




## ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోండి..

2




ప్రధాని మోడీ ఏం చెబితే ఎన్నికల కమిషన్ అదే చేస్తోంది


# చెత్త కుప్పల మధ్య విద్యుత్ బిల్లుల వసూళ్లు !



**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 24 (సిరి న్యూస్):**

ప్రజలకు సేవలు అందించాల్సిన విద్యుత్ శాఖ బిల్లుల వసూళ్ల విషయంలో చురుగ్గా వ్యవహరిస్తున్నప్పటికీ, కార్యాలయ నిర్వహణ విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని విద్యుత్ బిల్లు కలెక్షన్ కార్యాలయం ప్రస్తుతం చెత్తకుప్పను తలపిస్తోంది.కార్యాలయం చుట్టుపక్కలతో పాటు లోపల కూడా ఎక్కడ చూసినా చెత్త చెదారం కనిపిస్తుండగా, అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పేరుకుపోయిన వ్యర్థాల నుంచి దుర్గంధం వెదజల్లుతుండటంతో వినియోగదారులు ముక్కు మూసుకుని బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోడలపై తేమ, మురికి మరకలు పేరుకుపోవడంతో కార్యాలయ నిర్వహణపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు కార్యాలయానికి వస్తున్నప్పటికీ, కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వసూళ్లపై చూపుతున్న శ్రద్ధను కార్యాలయ పరిశుభ్రత, నిర్వహణపై ఎందుకు చూపడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని వినియోగదారులు వాపోతున్నారు. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలను ప్రచారం చేసే ప్రభుత్వ శాఖలే తమ కార్యాలయాల పరిశుభ్రతను విస్మరిస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ పరిసరాలను శుభ్రపరచడంతో పాటు, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో సేవలు అందేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. "విద్యుత్ బిల్లులు మాత్రం సకాలంలో వసూలు చేస్తున్న అధికారులు... కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచే బాధ్యత లేదా?" అనే ప్రశ్న ఇప్పుడు వినియోగదారుల నుంచి వినిపిస్తోంది.





# వేణుమాధవ్ చేరికతో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.

**సదాశివపేట. జూన్ 24. (సిరిన్యూస్)**

ప్రజా ఉద్యమాల నాయకుడు, మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెమలికొండ వేణుమాధవ్ బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడిగా వేణుమాధవ్‌కు మంచి గుర్తింపు ఉందని అన్నారు. ఆయన చేరికతో సంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ హక్కులు, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ చేపట్టే ఉద్యమాల్లో వేణుమాధవ్ కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దశబ్దాలుగా వారి కుటుంబం సామజిక సేవలో ఉన్నదని గుర్తు చేశారు. అనంతరం వేణుమాధవ్ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కవిత నాయకత్వంపై విశ్వాసంతో తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు తెలిపారు. తెలంగాణ లో ఆంధ్ర భావజాల పార్టీలకు తావు లేదని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యలను పార్టీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రవి చంద్ర, సయ్యద్ ఇస్మాయిల్, అర్చన సేనాపతి, జిల్లా ప్రతినిధులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బాలయ్య, మురళి కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, శివశంకర్, బస్వరాజ్, ప్రభాకర్ రెడ్డి, బెస్త రాము, నర్సింహా, నందు, యశ్వంత్, రాము, సాయి కార్యకర్తలు, వేణుమాధవ్ అనుచరులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోండి..

- ప్రధాని మోడీ ఏం చెబితే ఎన్నికల కమిషన్ అదే చేస్తోంది
- రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే ఈ దుర్మార్గపు పాలనకు చెక్
- ఓటర్ల సవరణపై అందరూ అప్రమత్తంగా ఉండాలి
- బీఎల్‌ఏలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి దిశానిర్దేశం
- సంగారెడ్డిలో 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులతో అత్యవసర సమావేశం
- సమావేశంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల తదితరులు.




**సంగారెడ్డి, జూన్ 24 (సిరి న్యూస్):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ సానుకూల ఓట్లను తొలగించడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను క్షేత్రస్థాయిలో అడ్డుకోవాలని ఆయన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ ఏం చెబితే ఎన్నికల కమిషన్ అదే చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల సానుకూల ఓట్ల తొలగింపుతో బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయని ఆయన మండిపడ్డారు. దేశంలో 543 ఎంపీ స్థానాలకు గాను కాంగ్రెస్ 300 స్థానాల్లో గెలిచి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఎన్నికల కమిషన్ కంట్రోల్‌లో ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రజల పక్షాన పార్లమెంటులో రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, ఆయన ప్రధాని అయితేనే ఈ ఓట్ల తొలగింపుల పంచాయతీ పోతుందని, దుర్మార్గమైన పాలన ఆగిపోయి మంచి పాలన మొదలవుతుందని స్పష్టం చేశారు. బీజేపీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే రాహుల్ గాంధీ ఈ మీటింగులు పెట్టుకోమన్నారని వివరించారు.

## అప్రమత్తంగా ఉండాలి.. ఫుల్ టైం కేటాయించాలి..

సంగారెడ్డి నియోజకవర్గంలోని 282 మంది బీఎల్‌ఏలు, ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు ఈనెల 25 నుండి జరిగే ఓటర్ల సవరణపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని జగ్గారెడ్డి సూచించారు. ఓటర్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత నాయకులదేనని అన్నారు. ఈ సవరణ ప్రక్రియ ముగిసేవరకు నాలుగు సార్లు సమావేశాలు ఏర్పాటు చేసుకుందామని, మళ్లీ జూలై 6వ తేదీన ఈ విషయంపై లోతుగా చర్చిద్దామని తెలిపారు. ప్రతీ మీటింగ్‌లోనూ బీఎల్‌ఏలు, ఇన్‌చార్జ్‌లు, గెలిచిన మరియు ఓడిన సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ 282 మంది బీఎల్‌ఏలు, ఇన్‌చార్జ్‌లు ఈ ప్రక్రియ కోసం ఫుల్ టైం కేటాయించాలని ఆదేశించారు. మీకు ఇచ్చిన ఐడీ కార్డులు జాగ్రత్తగా కాపాడుకోండి. పార్టీలో మీకు తగిన గుర్తింపు ఉంటుంది. మీ పనితీరు ఆధారంగానే ఆ గుర్తింపు ఉంటుందని మరవద్దు అని జగ్గారెడ్డి నాయకులకు ఉద్బోధించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రీతం, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.






# హాట్ టాపిక్‌గా.. మారీచి ఇంటి నంబర్ల వ్యవహారం !



## సిరి కథనంపై బిల్డర్స్ వర్గాల్లో చర్చ

- వివరణకు అందుబాటులో లేని డీసీ జ్యోతి రెడ్డి
- మారీచి వ్యవహారంపై స్పందించిన ఏసీపీ ప్రసీద
- సైట్ విజిట్ చేస్తాం..
- మాజీ డీసీ అజయ్ కుమార్ రెడ్డి లేఖను పరిశీలిస్తామన్న ఏసీపీ
- గత నోటీసులు, కూల్చివేత చర్యలపై దృష్టి
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే తదుపరి చర్యలు




**(నిఘావిభాగం - సిరిన్యూస్):**

**“మెరిసేదంతా బంగారం కాదన్నట్లు.. మారీచి విల్లాల ఇంటి నంబర్ల వ్యవహారం ప్రస్తుతం బిల్డర్స్ వర్గాల్లోనూ, స్థానికంగానూ హాట్ టాపిక్‌గా మారింది. ఇంటి నంబర్లు నిజంగా కేటాయించారా..? ఒకవేళ కేటాయించి ఉంటే ఏ ప్రాతిపదికన మంజూరు చేశారు..? గతంలో జారీ చేసిన నోటీసులు, కూల్చివేత చర్యల నేపథ్యంలో ఈ వ్యవహారంపై సిరి అడిగిన ప్రశ్నలకు ఏసీపీ ప్రసీద్ స్పందించడంతో ఇప్పుడు అందరి దృష్టి ఈ అంశంపైనే నిలిచింది.”**

మారీచి విల్లాలకు ఇంటి నంబర్లు వచ్చాయంటూ జరుగుతున్న ప్రచారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి పలు ఫిర్యాదులు, వివాదాలు, కోర్టు వ్యవహారాలు, గతంలో జారీ చేసిన నోటీసులు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇంటి నంబర్ల అంశం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. మారీచి విల్లాల ఇంటి నంబర్ల వ్యవహారంపై వివరణ కోరుతూ సిరి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డిని సంప్రదించినప్పటికీ, ఆమె అందుబాటులో లేకపోవడంతో స్పందన లభించలేదు. దీంతో ఇంటి నంబర్లు నిజంగా కేటాయించారా..? ఒకవేళ కేటాయించి ఉంటే ఏ ప్రాతిపదికన మంజూరు చేశారనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

### సైట్ విజిట్ చేస్తాం..
### చర్యలు తీసుకుంటాం ఏసీపీ ప్రసీద

మారీచి వ్యవహారంపై సిరి దినపత్రిక వివరణ కోరగా ఏసీపీ ప్రసీద స్పందించారు. మారీచి విల్లాలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుంటానని, స్వయంగా సైట్ విజిట్ నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. గతంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి జారీ చేసిన నోటీసులు, వాటిపై తీసుకున్న చర్యలు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను సమీక్షించి తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. అంతేకాకుండా, మాజీ డిప్యూటీ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి జారీ చేసిన డెమాలిషన్ లేఖను కూడా పరిశీలిస్తానని ఏసీపీ ప్రసీద్ తెలిపారు. గతంలో జారీ చేసిన నోటీసులు, సంబంధిత రికార్డులు, కూల్చివేత చర్యలకు సంబంధించిన అంశాలను అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాజీ డీసీ అజయ్ కుమార్ రెడ్డి





జారీ చేసిన డెమాలిషన్ లేఖ, గతంలో జారీ చేసిన నోటీసులు, ప్రస్తుత పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సైట్ విజిట్ నిర్వహించి, సమగ్ర పరిశీలన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీపీ ప్రసీద్ వెల్లడించారు. దీంతో మారీచి ఇంటి నంబర్ల వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా, బిల్డర్స్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# కాకతీయుల మెతుకు సీమ..!

## నిజాం కాలపు సుభా కేంద్రం


- వీరనారి శంకరమ్మ ఏలిన మెదక్ ఘన చరిత్ర
- గణపతి దేవుడి నామకరణంతో 'మెతుకు సీమ'గా మారిన రచవీడు
- కరువు కాలంలో కాకతీయ, దేవగిరి రాజ్యాలను ఆదుకున్న మంజీరా
- అల్లావుద్దీన్ ఖిల్జీ దాడులను తట్టుకుని నిలబడిన చారిత్రక మెదక్ కోట
- సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తులో పటిష్టమైన కోట.. 5 ఫిరంగి సెంటర్లు
- ప్రతాపరుద్రుడు నిర్మించిన గిడ్డంగులు నేటికీ సజీవ సాక్ష్యాలు
- వేద పండితులకు ఆశ్రయమిచ్చి 'వేదక్‌పూర్'గా ఖ్యాతి
- హైదరాబాద్ సంస్థానంలో వరంగల్, గుల్బర్గా, ఔరంగాబాద్‌లతో పాటు సుభా కేంద్రంగా మెదక్
- 1936లో సంగారెడ్డికి మారిన అధికార యంత్రాంగం
- జిల్లా కేంద్రం సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన స్వామీజీ శ్రీ రామ్ దాస్



సేకరణ : యం యల్ యన్ రెడ్డి,
సామాజిక వేత్త



**మెదక్, జూన్ 24 (సిరి న్యూస్) :** తెలంగాణ గుండెకాయ లాంటి ఉమ్మడి మెదక్ జిల్లాకు అద్భుతమైన చరిత్ర ఉంది. కాకతీయుల కాలంలో కరువును జయించిన అన్నపూర్ణగా, నిజాంల కాలంలో సుభా (రాష్ట్ర) కేంద్రంగా, వీరనారి రాణి శంకరమ్మ పాలనలో పటిష్టమైన సైనిక కేంద్రంగా విలసిల్లిన మెదక్ ప్రస్థానం ఎంతో ఘనమైనది. ఒకప్పుడు రాజధాని స్థాయి అనుభవించిన ఈ ప్రాంతం.. పాలకుల నిర్ణయాల వల్ల జిల్లా కేంద్రం హోదాను సైతం ఎలా కోల్పోవాల్సి వచ్చిందో తెలిపే ఆసక్తికరమైన చరిత్ర మీకోసం..




### రచవీడు నగరం.. 'మెతుకు సీమ'గా ఎలా మారింది?

క్రీస్తుశకం 1190 నుండి 1205 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతి దేవుడు పాలిస్తున్న సమయం. అప్పట్లో కాకతీయ ప్రాంతం తీవ్ర కరువుతో అల్లాడిపోతుంటే, దేవగిరి రాజు ఆదుకోవడానికి ముందుకొచ్చాడు. కానీ, కాకతీయ రాజ్యం దేవగిరికి సామంతురాలిగా (సంస్థానంగా) ఉండాలనే షరతు పెట్టాడు. ఆకలి బాధలు చూడలేక గణపతి దేవుడు ఆ షరతుకు ఒప్పుకున్నాడు. అప్పుడు మంజీరా పరీవాహక ప్రాంతమైన 'రచవీడు' నగరాన్ని పాలిస్తున్న రాజు ఓ శుభవార్త పంపాడు. తమ ప్రాంతంలో వరి సమృద్ధిగా పండిందని, కాకతీయ సామ్రాజ్యానికే కాకుండా దేవగిరి రాజ్యానికి కూడా ఎగుమతి చేసేంత పంట తమవద్ద ఉందని సందేశం పంపాడు. మంజీరా జలాలతో పండిన ఆ అన్నమే కాకతీయ సామ్రాజ్యం ఆత్మగౌరవాన్ని కాపాడింది. ఆ సంఘటనకు ముగ్ధుడైన గణపతి దేవుడు.. రచవీడు నగరానికి 'మెతుకు సీమ' (అన్నం పెట్టిన ప్రాంతం) అని నామకరణం చేశారు. ఈ చరిత్రకు సంబంధించిన ఆధారాలు నేటికీ వరంగల్ కోటలో చెక్కబడి ఉన్నాయి.

### ఖిల్జీ దాడులు.. పటిష్టమైన మెదక్ కోట..

సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తులో నిర్మించిన మెదక్ కోట శత్రుదుర్భేద్యమైనది. క్రీ.శ. 1303లో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ.. వరంగల్‌తో పాటు మెతుకు సీమ కోటపై భీకర దాడులు చేశాడు. ఈ దాడుల్లో కోటలోని శివాలయం, అమ్మవారి మరియు హనుమాన్ దేవాలయాలు ధ్వంసమయ్యాయి. అయితే ఈ కోటలో పూర్తి స్థాయి రక్షణ వ్యవస్థ ఉండేది. శత్రువులను దీటుగా ఎదుర్కోవడానికి 5 ఫిరంగి సెంటర్లు ఉండేవి (వాటిలోని మూడు గన్ పైపులు ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి). అలాగే కాకతీయ చివరి రాజు ప్రతాపరుద్రుడు ఈ కోటలో భారీ ధాన్యాగారాలను నిర్మించారు. ఈ కోట ఖిల్జీ తర్వాత ఉలుగ్ ఖాన్ చేతిలోకి వెళ్లినా.. ముసునూరి నాయకులు, రెడ్డి రాజులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. 17వ శతాబ్దంలో కుతుబ్ షాహీల వశమై, కోటపై మసీదు నిర్మాణం జరిగింది.

**వేద పండితులకు ఆశ్రయం 'వేదక్‌పూర్'..**

13వ శతాబ్దంలో ఖిల్జీ దాడుల సమయంలో హిందూ ధర్మాన్ని, విద్యను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఎంతోమంది వేదాంతులను, మహర్షులను ఈ మంజీరా ప్రాంతానికి (మరియు గోదావరి జిల్లాలకు) తరలించి కాపాడారు. వేదాలు బోధించిన ఈ పవిత్ర భూమిని అప్పట్లో కొందరు 'వేదక్‌పూర్' అని కూడా పిలిచేవారు. ఇక్కడి మంజీరా తీరంలోని వేద పాఠశాల నుండే ప్రముఖ సంస్కృత పండితుడు కోలాచలం మల్లినాథ సూరి.. కాశీ మరియు కేరళ ప్రాంతాలకు వెళ్లి వేద విద్యాలయాలను స్థాపించారని చరిత్ర చెబుతోంది.

### వీరనారి రాణి శంకరమ్మ..

మెతుకు సీమ చరిత్రలో రాణి శంకరమ్మ ఘట్టం సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ప్రస్తుతం ఉన్న పెద్ద శంకరంపేటలో ఆమె సైన్యానికి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఔరంగాబాద్ ప్రాంతంలో పీష్వాల పాలనపై ప్రజల తిరుగుబాటు జరిగినప్పుడు, ఆ ప్రాంతాన్ని నిజాం రాజ్యంలో కలుపడంలో శంకరమ్మ కీలక పాత్ర పోషించారు. కర్ణాటకలోని గుల్బర్గాపై టిప్పు సుల్తాన్ దాడికి వస్తే, అక్కడి రాజ్యాన్ని వీరోచితంగా రక్షించారు. ఆమె పోరాట పటిమకు మెచ్చిన నిజాం రాజు ఆమెకు 'రాయ్ భగిన్' అనే ప్రతిష్టాత్మక బిరుదును ప్రదానం చేశారు. ఆ కాలంలో హైదరాబాద్ రాష్ట్రంలో కేవలం నాలుగు సుభా (రాష్ట్ర/ప్రావిన్స్) కేంద్రాలు మాత్రమే ఉండేవి. అందులో ఒకటి వరంగల్ కాగా.. రెండవది మెతుకుసీమ (దీనికే గుల్షానాబాద్ అని పేరు), మూడవది గుల్బర్గా, నాలుగవది ఔరంగాబాద్.

### మెదక్ జిల్లాకు జరిగిన చారిత్రక అన్యాయం ఇదే..

ఒకప్పుడు సుభా కేంద్రంగా వెలుగొందిన మెదక్‌కు క్రమంగా అన్యాయం జరుగుతూ వచ్చింది. 1936లో ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ పర్యటనల నేపథ్యంలో ఈ అన్యాయానికి బీజం పడింది. ఆయన హైదరాబాద్ నుండి ఔరంగాబాద్, గుల్బర్గా వెళ్లే మార్గంలో మెదక్ రావడం భౌగోళికంగా కష్టంగా భావించాడు. దీంతో పరిపాలనా సౌలభ్యం కోసం తహసీల్దార్, కారోబార్ సహా ఇతర అధికార యంత్రాంగాన్ని సంగారెడ్డిలోని ఒక గెస్ట్ హౌస్‌కు మార్చేశారు. 1948లో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైంది. ఆ తర్వాత



1952లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా గుల్బర్గాను మైసూర్ రాష్ట్రంలో, ఔరంగాబాద్‌ను బొంబాయి రాష్ట్రంలో కలిపారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు, మెదక్ సుభా కేంద్రం అనే పేరును తొలగించారు. కొత్త జిల్లాకు 'మెదక్' అని పేరు పెట్టినప్పటికీ.. జిల్లా కేంద్రం (హెడ్ క్వార్టర్స్) మాత్రం సంగారెడ్డిలోనే కొనసాగించారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అప్పట్లో పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయి. మెదక్ జిల్లా కేంద్రం సాధన కోసం 'స్వామీజీ శ్రీ రామ్ దాస్' ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను బలిదానం చేయడం ఈ ప్రాంత చరిత్రలో ఒక విషాద ఘట్టం.